
9

సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 15 । నవంబర్ । 2023



సమస్యల సుడిగుండం..
సింగరేణి ఓసీ, జీటీపీఎస్ ప్రభావిత ప్రాంత గ్రామాలు అభివృద్ధికి నోచుకోక అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 10లో



మళ్లీ తెరపైకి 'అవిశ్వాసం'
ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో అవిశ్వాస అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 19°
వాతావరణం
జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటాయి. తెల్లవారుజామున మంచు, రాత్రికి చలి పెరుగుతాయి.

బరిలో ఎందరో?

జిల్లాలో 136 నామినేషన్లు దాఖలు
- పరిశీలనలో 16 దరఖాస్తుల తిరస్కరణ
- నేడు ఉపసంహరణకు అవకాశం
- కాంగ్రెస్‌ను వీడని రెబల్స్ బెడద
- ప్రచారంలో జోరు చూపిస్తున్న 'కారు'



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర అసెంబ్లీకి జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో కీలక ఘట్టానికి నేడు తెర లేవనుంది. ప్రజాక్షేత్రంలో పోరాడేందుకు ఏళ్ల తరబడి ప్రణాళికలు రూపొందించుకున్న అభ్యర్థుల్లో ఎందరు పోటీలో నిలబడతారు ? ఎవరు వెనకడుగు వేస్తారనేది బుధవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ తర్వాత తేలనుంది.

బుజ్జగింపుల్లేవ్..
టికెట్‌పై గంపెడాశలు పెట్టుకుని, నెరవేరకపోవడంతో కొందరు నేతలు చివరి నిమిషంలో రెబల్ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్, బీజేపీతో పోలిస్తే రెబల్స్ బెడద కాంగ్రెస్‌కే ఎక్కువగా ఉంది. ఇల్లెందు నుంచి జి.నాగమణి, బానోత్ స్రవంతి, మంగీలాల్ నాయక్ రెబల్స్‌గా నామినేషన్లు వేశారు. వీరితో పాటు వేసిన జి.రవి, బాణోతు విజయలక్ష్మి నామినేషన్లు స్క్రూటినీలో తిరస్కరణకు గురయ్యాయి. పినపాకలో బట్టా విజయ్‌గాంధీ కాంగ్రెస్ రెబల్‌గా బరిలో ఉన్నారు. అయితే తిరుగుబాటు అభ్యర్థులను బుజ్జగించేందుకు కాంగ్రెస్ తరఫున పెద్దగా ప్రయత్నాలు జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో టికెట్ దక్కని నేతలు రెబల్స్‌గా బరిలో ఉండేందుకే మొగ్గు చూపుతున్నారు. లేదంటే ఇతర పార్టీల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇల్లెందు నుంచి కాంగ్రెస్ నేత చీమల వెంకటేశ్వర్లు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున నామినేషన్ వేశారు.

బీఆర్ఎస్ దూకుడు
ఎన్నికల షెడ్యూల్ జారీ కావడానికి ముందు జిల్లాలో నాలుగు స్థానాల నుంచి సిట్టింగ్‌లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరందరికీ మరోసారి ఎన్నికల్లో పోటీ చేసే చాన్స్ వచ్చింది. దీంతో ఆ పార్టీకి రెబల్స్ బెడద లేదు. మరోవైపు ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీల నుంచి అసంతృప్త నేతలను తమ వైపు ఆకర్షిస్తోంది. షెడ్యూల్ జారీ అయిన తర్వాత టికెట్ దక్కని ప్రముఖులంతా 'కారు' ఎక్కేందుకు డోర్లు తెరిచే ఉంటున్నాయి. దీంతో అసంతృప్తితో ఉన్న నేతలు బీఆర్ఎస్‌లోకి వెళ్తున్నారు. ఇప్పటికే అశ్వారావుపేట నుంచి తాటి వెంకటేశ్వర్లు, సున్నం నాగమణి, వగ్గెల పూజ, కొత్తగూడెం నుంచి ఎడవల్లి కృష్ణ, భద్రాచలం నుంచి రావులపల్లి రాంప్రసాద్(సీపీఐ), ఇల్లెందు నుంచి ప్రవీణ్‌నాయక్ (కాంగ్రెస్), ఊకె అబ్బయ్య(బీజేపీ)ను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. కారు జోరు చూస్తుంటే నేడు మరి కొందరు గులాబీ కండువా కప్పుకునేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం జరుగుతోంది.

120 నామినేషన్లు చెల్లుబాటు..
జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ నవంబర్ 3 నుంచి 10వ తేదీ వరకు కొనసాగింది. ఐదు నియోజవర్గాల్లో ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు, రెబల్స్ కలిసి మొత్తం 136 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో అత్యధికంగా కొత్తగూడెం నుంచి 36 మంది అభ్యర్థులు ఉండగా అతి తక్కువగా భద్రాచలం నుంచి 18 మంది పోటీకి ఆసక్తి చూపించారు. అయితే ఈనెల 13న జరిగిన పరిశీలనలో జిల్లా వ్యాప్తంగా 16 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో ఐదు నియోజకవర్గాల్లో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల సంఖ్య 120కి పరిమితమైంది. చెల్లుబాటు కాని నామినేషన్లలో అత్యధికంగా భద్రాచలంలో ఐదు, ఇల్లెందులో నాలుగు ఉన్నాయి.

ఊపందుకోనున్న ప్రచారం
నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ బుధవారం ఉండడంతో ప్రధాన పార్టీలతో పాటు రెబల్స్, స్వతంత్రులు ఎవరు బరిలో ఉంటారనే అంశంపై స్పష్టత రానుంది. ఆయా నియోజకవర్గాల్లో ముఖాముఖీ పోరా? త్రిముఖమా, బహుముఖమా అనేది నేడు తేలనుంది. వాటి ఆధారంగా ప్రచారం ఉధృతం చేసే పనిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ తరఫున సీఎం కేసీఆర్ ఐదు నియోజకవర్గాల్లో బహిరంగ సభలు పూర్తి చేశారు. రెండో విడత ప్రచారంలో భాగంగా మంత్రి కేటీఆర్ కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలంలో రోడ్‌షోలు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేశారు. అగ్రనేతల బహిరంగ సభల షెడ్యూల్‌ను ప్రకటించే పనిలో కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలు ఉన్నాయి.

జంగ్ తెలంగాణ

16 నుంచి ఓటరు స్లిప్పులు

జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఓటరు స్లిప్పుల జారీకి షెడ్యూల్ రూపొందించనున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. హైదరాబాద్ నుంచి అదనపు ఎన్నికల అధికారి సర్ఫ్‌రాజ్ అహ్మద్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, జిల్లా నుంచి ప్రియాంక పాల్గొని వివరాలు వెల్లడించారు. జిల్లాలో 512 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 16, 17, 18 తేదీల్లో ఓటరు స్లిప్పుల పంపిణీకి నియోజకవర్గాల వారీగా షెడ్యూల్ తయారుచేసినట్లు చెప్పారు. స్లిప్పుల పంపిణీ పర్యవేక్షణకు ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించామని తెలిపారు. సమావేశంలో వెబ్‌కాస్టింగ్ నోడల్ అధికారి సులోచనారాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు దారా ప్రసాద్, రంగాప్రసాద్, ఈడీఎం విజయసారధి, దిలీప్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పరిశీలకులు
జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆలను ఎన్నికల సాధారణ పరిశీలకులు కమల్‌కిషోర్, హరికిషోర్, గణేష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యలను ప్రియాంక వివరించగా, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు వారు చెప్పారు. బుధవారం నామినేషన్లకు ఉపసంహరణకు తుది గడువు ఉన్నందున దాఖలు చేసిన అభ్యర్థుల నుంచి రిటర్నింగ్ అధికారులు డిక్లరేషన్ ఫారం తీసుకుని తెలుగు అక్షరమాల ప్రాతిపదికన బ్యాలెట్ పేపర్ లిస్టు తయారుచేయాలని, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించాలని తెలిపారు. సమావేశంలో పినపాక రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్‌కు బాలలే పునాది
దేశ భవిష్యత్తుకు బాలలే పునాదని, వారిని భావి పౌరులుగా తీర్చిదిద్దేలా తల్లిదండ్రులు, గురువులు కృషి చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన బాలల దినోత్సవంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తల్లి ఒడి ప్రతి ఒక్కరికీ ప్రథమ బడి అన్నారు. చిన్నతనం నుంచే తల్లిదండ్రులు పిల్లలకు క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించాలని సూచించారు. చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి విజేత, డీపీఆర్ఓ శ్రీనివాస్, డీఐఈఓ సులోచనారాణి, డీఈఓ వెంకటాచారి పాల్గొన్నారు.

కొండరెడ్ల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


పరీక్షలు చేస్తున్న వైద్యులు

అశ్వారావుపేటరూరల్: కొండరెడ్ల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, ఈ క్రమంలోనే వారికి వైద్య పరీక్షలు చేసేందుకు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ బాలాజీ నాయక్ తెలిపారు. మండలంలోని రెడ్డిగూడెంలో గల కొండరెడ్లకు మంగళవారం ఆరోగ్య పరీక్షలు చేశారు. సుమారు 100 మందికి ఉచితంగా పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొండరెడ్ల ఆరోగ్య సమాచారాన్ని ప్రత్యేకంగా నమోదు చేస్తున్నామని, తద్వారా భవిష్యత్‌లో వారి ఆరోగ్య పరిస్థితులపై అనుసరించే అవకాశం ఉంటుందని అన్నారు. సేకరించిన రక్త నమూనాలను టీ హబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రాందాస్ నాయక్, సబ్ యూనిట్ అధికారి అజ్మీరా వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ రోడ్‌షో

- ఉమ్మడి జిల్లాలో రెండు రోజులు ప్రచారం
- 18న కొత్తగూడెం, 19న భద్రాచలం, ఇల్లెందు, ఖమ్మంలో..



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ ప్రచార జోరు పెంచింది. ఇప్పటికే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు చివరి దశకు చేరగా... మరోపక్క మంత్రి కేటీఆర్ రోడ్‌షోలకు షెడ్యూల్ ఖరారైంది. సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి ఏడు సభల్లో పాల్గొనగా.. ఈనెల 21న మధిర, వైరా ప్రజా ఆశీర్వాద సభలు జరగనున్నాయి. ఇక రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఈనెల 18, 19వ తేదీల్లో జరిగే రోడ్‌షోలకు హాజరుకానున్నారు. ఈనెల 18న మధ్యాహ్నం ఒంటి గంటకు కొత్తగూడెంలో, 19న భద్రాచలం, ఇల్లెందు, ఖమ్మంలో జరిగే రోడ్‌షోల్లో ఆయన పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ముఖ్యనేతల రోడ్డు షోలు పూర్తయ్యాక అభ్యర్థులు ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీల్లో భారీ ర్యాలీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఫ్లాగ్ మార్చ్‌లో ఎస్పీ వినీత్ తదితరులు

కొత్తగూడెంరూరల్: ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ వినీత్ అన్నారు. కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డ్ నుంచి కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ వరకు మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 30న ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. మద్యం, నగదు, ఇతర వస్తువుల ద్వారా ఎవరైనా ఓటర్లను ప్రలోభపెడితే ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేసి చర్య తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ రెహమాన్, సీఐలు పెద్దన్నకుమార్, కరుణాకర్, మురళి, ఎస్ఐ సంతోష్ పాల్గొన్నారు.

ఆ నలుగురు..!

- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో వారిదే ప్రధాన భూమిక
- ఉమ్మడి జిల్లా అంతా తామై వ్యవహరిస్తున్న నేతలు
- ప్రచారం మొదలు చేరికల వరకు సమన్వయం
- బీఆర్ఎస్‌లో కీలకంగా మంత్రి పువ్వాడ, ఎంపీలు నామ, వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు
- కాంగ్రెస్‌లో భట్టి, శ్రీనివాసరెడ్డి, తుమ్మల, బాలసాని

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయాలు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లోని ఆ నేతల చుట్టే తిరుగుతున్నాయి. ప్రచారం నుంచి నేతలు, కార్యకర్తల సమన్వయం, చేరికలు, వ్యూహాల రూపకల్పన తదితర అంశాల్లో వీరే ప్రధాన భూమిక పోషిస్తున్నారు. బీఆర్ఎస్‌లో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, కాంగ్రెస్‌లో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ ఈ వ్యవహారాలను చక్కబెడుతున్నారు.

పావులు కదుపుతున్న బీఆర్ఎస్
రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బీఆర్ఎస్ తరఫున ఖమ్మం నుంచి బరిలో ఉండగా.. తన నియోజకవర్గంతోపాటు ఇతర చోట్ల కూడా అక్కడి నేతలతో సమన్వయం చేసుకుంటున్నారు. అలాగే, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు అన్ని స్థానాల్లో అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహ, ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. మంత్రి పువ్వాడకు మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా ఆయన దృష్టి సారించారు. ఇక ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చొరవతో బీఆర్ఎస్‌లోకి మాజీ మంత్రి సంభాని సహా పలువురి చేరికలు జోరందుకోగా, ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌గా ప్రచారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. మరోపక్క బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారం, వ్యూహాల రూపకల్పనలో ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు చురుగ్గా వ్యవహరిస్తూ కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తున్నారు.

దీటుగా కాంగ్రెస్ సమన్వయం
సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సమన్వయం చేస్తున్నారు. భట్టి తన నియోజకవర్గం మధిరతోపాటు ఇతర నియోజకవర్గాల ప్రచారంలోనూ పాల్గొంటున్నారు. ఇక పొంగులేటి పాలేరులో ప్రచారం చేస్తూనే కొత్తగూడెం తదితర ప్రాంతాలకు హాజరవుతున్నారు. భట్టి, పొంగులేటి, తుమ్మల ఉమ్మడి జిల్లాను ప్రభావితం చేయదగిన నేతలు కావడంతో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల సభలు, రోడ్‌షోలు జరగనుండగా ఏర్పాట్లపై దృష్టి సారించారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అటు భద్రాచలం, ఇటు ఖమ్మంపై దృష్టి సారించి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఎవరి ప్రతిష్ట పెరిగేనో..
ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఈ నేపథ్యాన కీలక నాయకులు ఇతర పార్టీల నేతలను చేర్చుకోవడమే కాక ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు చేస్తూ ఓటర్లను ఆకట్టుకోవడంలో నిమగ్నమయ్యారు. గతంలో కంటే భిన్నంగా ఉమ్మడి జిల్లాలో అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ నేతలు అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం సర్వశక్తులొడ్డుతున్నారు. ఇందుకోసం తమ నియోజకవర్గాల్లోనే కాకుండా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రచారానికి హాజరవుతున్నారు. అయితే ఓటర్లను ఆకట్టుకోవడంలో వీరిలో ఎవరు సఫలమవుతారో ఫలితాలు వచ్చాక తేలిపోనుంది.

యువతే అధికం..

- జిల్లాలో మొత్తం 9,84,909 మంది ఓటర్లు
- సగానికి పైగా యువతీ, యువకులే
- కొత్తగా ఓటుహక్కు పొందిన వారు 27,484 మంది
- తాజా లెక్కలతో మారనున్న ప్రచార సరళి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల భవిష్యత్తును నిర్ణయించే వారిలో యువ ఓటర్లు ప్రధాన భూమిక పోషించనున్నారు. ఎన్నికల సంఘం తాజాగా ప్రకటించిన వివరాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 9,84,909 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో సగానికి పైగా అంటే దాదాపు 51 శాతం మంది 40 ఏళ్ల లోపు వారున్నారు. ఇక ఈ సారి కొత్తగా ఓటుహక్కు పొందిన వారి శాతం 2.8గా ఉంది.

ఇంటింటి ప్రచారమే మేలు..
40 ఏళ్లు.. ఆ పైన వయసున్న వారు ప్రభుత్వ పథకాల అమలు, ఎమ్మెల్యేల వ్యవహారశైలిని నిశితంగా గమనించి ఓటు వేస్తుంటారు. దీంతో వీరిని ఒప్పించేందుకు ఇంటింటి ప్రచారమే మేలైన పద్ధతి అని ఆయా పార్టీలు భావిస్తున్నాయి. మొత్తం ఓటర్లలో 40.. ఆపై వయస్కులు 49 శాతం ఉన్నారు. వీరు స్వచ్ఛందంగా ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంటుంది. తమ రాజకీయ అభిప్రాయాలను బహిరంగంగా చెప్పకపోయినా కచ్చితమైన నిర్ణయాలు వీరి సొంతం. దీంతో ఈ ఓటు బ్యాంకు కోసం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో తమకే మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.



టార్గెట్ యువత..
40 ఏళ్లలోపు ఉన్న ఓటర్లలో 90 శాతం మంది స్మార్ట్ ఫోన్లు ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా 30 ఏళ్లలోపు వయసున్న ఓటర్లు ఐదు నియోజకవర్గాల్లోనూ సగటున 22 శాతం వరకు ఉన్నారు. దీంతో వారిని లక్ష్యంగా చేసుకుని రాజకీయ పార్టీలు, ప్రధాన పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు సోషల్ మీడియా ప్రచారాన్ని ఉధృతం చేయనున్నారు. పెన్షన్లు, రైతుబంధు, పోడు పట్టాల పంపిణీ తదితర సంక్షేమ కార్యక్రమాల కంటే కూడా ఐటీ, పరిశ్రమలు, తలసరి ఆదాయం వంటి అభివృద్ధి మంత్రాలను లక్ష్యంగా చేసుకుని యువ ఓటర్లను ఆకర్షించే పనిలో వ్యూహాలు రూపొందిస్తున్నారు.

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో వయసుల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	18-19	20-29	30-39	40-49	50-59	60-69	70-79	80 ప్లస్	మొత్తం
పినపాక	5,949	40,507	56,791	58,541	29,475	17,503	7,291	2,345	1,98,402
ఇల్లెందు	6,408	43,799	64,259	40,729	31,619	19,405	9,145	2,675	2,19,569
కొత్తగూడెం	7,508	47,515	67,773	50,852	36,523	21,005	9,457	3,213	2,43,118
అశ్వారావుపేట	4,817	30,597	44,999	29,756	24,003	13,630	6,070	2,089	1,55,961
భద్రాచలం	2,808	26,503	43,384	30,949	23,070	13,872	6,304	1,771	1,48,661
	27,490	1,88,921	2,77,206	2,10,827	1,44,690	85,415	38,267	12,093	9,84,909

ఇల్లెందు ఏరియాలో పర్యటించిన డైరెక్టర్


ప్లాంట్ స్థలాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

ఇల్లెందు: సింగరేణి డైరెక్టర్ డి.సత్యనారాయణ మంగళవారం ఇల్లెందు ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా జేకే ఓసీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పంప్ స్టోరేజ్ పవర్‌ప్లాంట్ కోసం అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ పంప్ స్టోరేజ్ పవర్‌ప్లాంట్ ద్వారా సహజ వనరులను వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు డైరెక్టర్ తెలిపారు. తద్వారా ఇల్లెందు ఏరియాకు పూర్వ వైభవం వస్తుందన్నారు. ఏరియా జీఎం జాన్‌ఆనంద్, అధికారులు పీఎస్‌కే. రవి, జానకీరాం, కుమార్, కేవీ.రావు, నరసింహరాజు, బొల్లం వెంకటేశ్వర్లు, అంజిరెడ్డి, శేఖర్‌బాబు, బాలాజీనాయుడు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, వీరానాయక్, శివకుమార్ పాల్గొన్నారు.

గోదావరి ప్రవాహాన్ని పరిశీలించిన అధికారులు


తెప్పోత్సవం సాధ్యాసాధ్యాలపై చర్చిస్తున్న అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల వద్ద గోదావరి ప్రవాహాన్ని ఇరిగేషన్ శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఇక్కడికి సమీపాన సీతమ్మసాగర్ ప్రాజెక్టులో భాగంగా కాంక్రీట్ గోడ నిర్మాణం చేపట్టగా, పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో ఈ ఏడాది శ్రీ సీతారాముల వారి తెప్పోత్సవం నిర్వహణ కోసం ప్రవాహాన్ని అధికారులు పరిశీలించి సాధ్యాసాధ్యాలపై చర్చించారు. తెప్పోత్సవాన్ని గోదావరి లోతులో కాకుండా ఒడ్డుకు సమీపాన నిర్వహించాలని దేవస్థానం అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, జేఈలు రాజ్‌సుహాస్, వెంకటేశ్‌తో పాటు లక్ష్మయ్య, ప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు.

చెక్‌పోస్టు వద్ద నిఘా నేత్రాలు ఏర్పాటు


బ్రిడ్జి సెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

భద్రాచలంఅర్బన్: ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భద్రాచలం మీదుగా గంజాయి తదితర మత్తు పదార్థాల రవాణాను అడ్డుకునేందుకు ఇప్పటికే పట్టణంలోని బ్రిడ్జిసెంటర్‌లో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఇక్కడ సిబ్బంది 24 గంటల పాటు వాహనాలను తనిఖీ చేస్తుండగా పెద్ద మొత్తంలో గంజాయి రవాణాను కట్టడి చేయగలిగారు. ఇక మరింత నిఘా కోసం ఎక్సైజ్ అధికారులు మంగళవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తద్వారా వాహనాల నంబర్ ప్లేట్లు మార్చి వెళ్లే వారిని గుర్తించడంతో పాటు అక్రమ రవాణాను అదుపు చేయడం సాధ్యమవుతుందని చెబుతున్నారు.

డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా
పాల్వంచ : పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్వయం ప్రతిపత్తి హోదా కల్పించింది. జిల్లాలో ఈ అర్హత సాధించిన మొదటి, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండో డిగ్రీ కళాశాల ఇదే కావడం విశేషం. ఈ హోదాతో కళాశాల అభివృద్ధితో పాటు ఈ ప్రాంత అవసరాలకు తగ్గట్టుగా నూతన కోర్సులు ప్రవేశపెట్టుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.చిన్నప్పయ్య మాట్లాడుతూ గత ఐదేళ్లుగా అడ్మిషన్లు, ఫలితాలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాల వల్లనే ఈ హోదా సాధ్యమైందని తెలిపారు. కళాశాల విద్యా కమిషనర్ వాకాటి కరుణ, ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, జాయింట్ డైరెక్టర్లు జి.యాదగిరి, డీఎస్ఆర్ రాజేంద్రసింగ్, ప్రొఫెసర్ బాలభాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

భారజల కర్మాగారం జీఎంగా జగ్గారావు


జగ్గారావును అభినందిస్తున్న కేవీ థాలే

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం డీజీఎం జగ్గారావుకు జీఎంగా పదోన్నతి లభించింది. ప్రస్తుత జీఎం కేవీ థాలే భారజల బోర్డుకు బదిలీ కాగా, జగ్గారావుకు జీఎంగా పదోన్నతి కల్పించారు. మణుగూరు భారజల కర్మాగారంలో 33ఏళ్ల కిందట విధుల్లో చేరిన ఆయన వివిధ పదవులు నిర్వర్తిస్తూ జీఎంగా పదోన్నతి పొందడం విశేషం. ఈ సందర్భంగా జగ్గారావును ప్రస్తుత జీఎం కేవీ థాలే, భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావుతోపాటు పాద్య కేశవరావు, శివకామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు తదితరులు మంగళవారం అభినందించారు.

'ఓపెన్' ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్
కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు కల్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు ప్రవేశాలు పొందొచ్చని పేర్కొన్నారు. వివరాల కోసం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు (80084 03522)ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న స్వపన్ సర్కార్

గుండాల: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున పోలీసులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అబ్జర్వర్ స్వపన్ సర్కార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ చెక్‌పోస్టు, పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. వివరాలను సీఐ రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నక్సల్ ప్రభావిత ప్రాంతం కావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని, రాజకీయ నాయకులు పోలీసులకు సహకరించాలని పేర్కొన్నారు. ఆయన వెంట సీఐ రవీందర్, ఎస్‌ఐ రాజశేఖర్ ఉన్నారు.

నగదు సీజ్

దమ్మపేట: ఎన్నికల నిబంధనల మేరకు చేస్తున్న తనిఖీల్లో పట్టుబడిన నగదును పోలీసులు సీజ్ చేశారు. మంగళవారం మండలంలోని మందలపల్లి చెక్‌పోస్ట్ వద్ద చేస్తున్న తనిఖీల్లో మూడు వేర్వేరు కార్లలో కలిపి మొత్తంగా రూ.2,66,800 నగదును గుర్తించారు. వాహనదారుల వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో, ఆ నగదును ఎఫ్ఎస్ టీం అధికారి కృష్ణ, పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు.

పోలీస్ వాహనాన్ని ఢీకొట్టిన లారీ

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం మోకాళ్లగుంపు పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, కొత్తగూడెం నుంచి ఇల్లెందు వెళ్తున్న ఇసుక లారీ పోలీస్ వాహనాన్ని ఢీకొట్టింది. డ్రైవర్ తాగిన మైకంలో పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టడంతో కొంతమేర ధ్వంసమైంది. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్యపై కేసు నమోదు

దమ్మపేట: కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపం చెందిన వ్యక్తి పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పట్వారిగూడెం గ్రామానికి చెందిన పెద్దసింగ్ మాధవరావు (51) హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా మాధవరావు పని చేయకుండా తిరుగుతున్నాడు. అతడి భార్య గోవర్ధన, అతడి కుమారుడు, హోటల్ పనిలో సహకరించకుండా ఎందుకు తిరుగుతున్నావని మందలించారు. మనస్తాపానికి గురైన ఆయన పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందగా మంగళవారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తిపై దాడి

బూర్గంపాడు: సారపాకలోని పల్లెప్రకృతి వనం వద్ద సోమవారం రాత్రి ఓ వ్యక్తిపై దాడి జరిగింది. ఎస్‌ఐ రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. సారపాకలోని ఓ కారు షోరూంలో ఎస్‌కే ఉస్మాన్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ షోరూంలోనే పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి కొన్ని రోజుల కిందట ఉద్యోగం మానేసింది. అదే షోరూంలో మెకానిక్‌గా పనిచేస్తున్న అగ్నిపర్తి రామకృష్ణ ఆమె ఉద్యోగం మానేయడానికి మేనేజర్ ఉస్మానే కారణమని భావించాడు. ఈ క్రమంలో రామకృష్ణ సోమవారం రాత్రి ఉస్మాన్‌కు ఫోన్ చేసి సారపాక పల్లె ప్రకృతి వనం వద్దకు పిలిచి.. బీరు బాటిళ్లతో దాడి చేశాడు. ఈ ఘటనలో ఉస్మాన్ రెండు చేతులకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య

విధుల్లో ఒత్తిడే కారణమని సూసైడ్‌నోట్

ఖమ్మంరూరల్/కారేపల్లి: కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా గ్రామపంచాయతీ పరిధి లావుడ్యాతండాకు చెందిన బ్యాంకు మేనేజర్ ఖమ్మంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లావుడ్యాతండా గ్రామానికి చెందిన గుగులోతు అశోక్ (37) ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి సమీపాన శ్రీసాయి ఆదిత్య టౌన్‌షిప్‌లో ఉంటూ సూర్యాపేట జిల్లా కోదాడ యూనియన్ బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమవారం విధులకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన ఆయన మధ్యాహ్నం తన ఇంటి సమీపంలోని వ్యక్తికి ఫోన్‌చేసి చెప్పి ప్రమాదంలో ఉన్నానంటూ చెప్పి లొకేషన్ పంపించాడు. దీంతో ఆయన వెళ్లి ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం సమీపాన వెతకగా చెట్లపొదల్లో అశోక్ మృతదేహం కనిపించింది. ఆ పక్కనే పురుగుల మందు డబ్బా, బ్యాంక్ విధుల్లో ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా సూసైడ్ నోట్ లభించింది. ఈమేరకు అశోక్ భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఖమ్మం రూరల్ ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

పామాయిల్ గెలలు 

టన్ను ధర	రూ.12,196

సమస్యల సుడిగుండం..

- బీటీపీఎస్, సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి శూన్యం
- ఆగమవుతున్న స్థానికుల బతుకులు
- వ్యాధులతో అవస్థ, సమస్యలతో సతమతం
- అంతంత మాత్రంగానే ఉపాధి అవకాశాలు



గోదావరిలో కలుస్తున్న బీటీపీఎస్ నుంచి వెలువడే వ్యర్థాలు

మణుగూరుటౌన్: సింగరేణి ఓపెన్‌కాస్ట్, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రభావిత ప్రాంత ప్రజలు, గ్రామాలు అభివృద్ధికి నోచుకోక అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, తమ గ్రామం అభివృద్ధి బాట పడుతుందని, జీవితాలు బాగుపడతాయని ఆశిస్తే చివరికి నిరాశే ఎదురవడం వారి ఆవేదనకు కారణమవుతోంది. పారిశ్రామిక సంస్థలు ప్రారంభ సమయంలో ఇచ్చిన హామీలు ఏళ్లు గడుస్తున్నా నెరవేరలేదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని మణుగూరు మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి గనులు కాలుష్యపు కోరలు చాచగా, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ బొగ్గు తరలింపుతో వస్తున్న కాలుష్యం, పైపు లీకేజీలతో గరళంగా మారుతున్న గోదావరి, నిత్య ప్రమాదాలతో గాలిలో దీపాలుగా మారిన ప్రజల ప్రాణాలు, పట్టింపులేని పాలకుల తీరుతో నిత్యనరకం అనుభవిస్తున్నారు.

ప్రజా అజెండా

బతుకు జీవుడా..

ప్రభావిత ప్రాంతాల ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తూ రోగాలతో అవస్థలు పడుతూ ఆర్థిక నష్టానికి గురవుతూ బతుకుజీవుడా అంటూ జీవిస్తున్నారు. అభివృద్ధి పేరిట తీసుకున్న స్థలాల్లో వెలిసిన సంస్థలు ఇప్పుడు పట్టించుకోవడం లేదు. బీటీపీఎస్, సింగరేణి వల్ల వస్తున్న కాలుష్యం, లీకేజీ, బొగ్గు లారీల ప్రమాదాలతో, శ్వాసకోస వ్యాధులతో నిత్యం సతమతమవుతున్నారు. 'దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు' అన్న చందంగా వారి దుస్థితి మారింది. సింగరేణి ప్రభావిత గ్రామాలైన విప్పల సింగారం, పగిడేరు, మణుగూరు, రాజుపేట, గాంధీనగర్, బీటీపీఎస్ ప్రభావిత ప్రాంతాలైన దమ్మక్కపేట, సాంబాయిగూడెం, రామానుజవరం గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలూ అందుబాటులోకి రాలేదు. సింగరేణిలో ప్రతిరోజు జరిగే బ్లాస్టింగ్‌లతో గాంధీనగర్, రాజుపేట, పగిడేరు గ్రామాల్లోని నివాసాలు బీటలు వారుతున్నాయి. బ్లాస్టింగ్‌కు లేచిన దుమ్ము, ధూళి ఇంటిలోని తాగునీటిపై చేరుతోంది. ఆ నీళ్లను తాగిన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. మణుగూరు ఓసీ నుంచి సింగరేణికి.. సింగరేణి నుంచి బీటీపీఎస్‌కు బొగ్గు తరలిస్తున్న క్రమంలో లారీల వేగానికి వందల జీవాలు, ప్రజల ప్రాణాలు కోల్పోగా, వందలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. బీటీపీఎస్ యాష్‌పాండ్ లీకేజీతో గోదావరిలో బూడిద కలిసి కలుషితమవుతున్నాయి. వెలువడుతున్న వ్యర్థ పదార్థాలు దమ్మక్కపేట, చిక్కుడుగుంట, సాంబాయిగూడెం నివాసాలపై పడటం.. ఆ గాలిని పీల్చి శ్వాస కోశ వ్యాధులతో పాటు చర్మ సంబంధిత రోగాలు, జ్వరాలు, ఎముకలకు సంబంధించిన వ్యాధులను తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అయినప్పటికీ హెల్త్ క్యాంపు నిర్వహించకపోవడం గమనార్హం.

ఉపాధి కల్పన నామమాత్రమే

బీటీపీఎస్‌లో డిగ్రీ నుంచి పీజీ చదివిన వారితో పాటు నిరక్షరాస్యులకూ రూ.300 నుంచి రూ.350 మించి రోజువారీ వేతనం ఇవ్వకపోవడంతో వెట్టి చాకిరీకి ప్రతిరూపంగా మారినట్లయింది. సబ్ కాంట్రాక్టర్ల ద్వారా స్థానికేతరులకే అవకాశం కల్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీటీపీఎస్ భూనిర్వాసితులకు కొందరికి జెన్కో శాశ్వత ఉపాధి కల్పించగా, ఆయా పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే వారు మౌలిక సదుపాయాలపై ప్రశ్నించినా ఫలితం ఉండటం లేదు. సింగరేణి ఓబీ కంపెనీలతో పాటు ఇతర ప్రైవేట్ కంపెనీల్లో 70 శాతం స్థానికులకే అవకాశం కల్పించాలని ఉన్నా అవేవి అమలు కావడం లేదని పగిడేరు, గాంధీనగర్, బుగ్గ, రాజుపేట, సాంబాయిగూడెం మణుగూరు యువకులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

సీఎస్ఆర్ నిధులు ఎక్కడ?



సీఎస్ఆర్ నిధులను బీటీపీఎస్, సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో కాకుండా ఇతర చోట్ల వెచ్చిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేల సిఫారసుతో ఇలా చేస్తున్నామని అధికారులు అంటున్నారు. ఇకనైనా పాలకులు సీఎస్ఆర్ నిధులు ప్రభావిత గ్రామాల్లోనే వినియోగించి సదుపాయాల కల్పన, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి.

–మధుసూదన్‌రెడ్డి, ఎన్డీ నాయకుడు

మా గ్రామాలకు నిధులు లేవు



2018లో రూ.90 లక్షలు సీఎస్ఆర్ ఫండ్ సింగరేణి ఇచ్చింది. ఆ తర్వాత రూపాయి రాలేదు. పగిడేరు బీటీపీఎస్, సింగరేణికి ప్రభావిత గ్రామమైనా పట్టించుకోవడం లేదు. కలెక్టర్, అదనపు కలెక్టర్, సింగరేణి అధికారులకు వినతిపత్రాలు ఇస్తే ప్రతిపాదనలతో సరిపెడుతున్నారు.

–తాటి సావిత్రి, పగిడేరు సర్పంచ్

అభివృద్ధి శూన్యం..

ప్రభావిత ప్రాంతాల మౌలిక సదుపాయాల ఏర్పాటు, అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన అంశాలపై ఆయా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదనే విమర్శలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. సింగరేణి, బీటీపీఎస్ ప్రత్యేక నిధులైన సీఎస్ఆర్, సంక్షేమ నిధులు కేటాయిస్తున్నా అవి తమ గ్రామాల్లో వినియోగించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూములు, నివాసాలు, పొలాలు కోల్పోయి ఆరోగ్యం కూడా కోల్పోతున్నారు. అయినా తమకు కనీసం రోడ్లకు మరమ్మతులు, సైడ్ డ్రెయిన్లు, తాగునీరు, డ్రెయినేజీలు, విద్యుత్ దీపాలు కల్పించడం లేదని వినతులు ఇచ్చినా బుట్టదాఖలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బొగ్గు, యాష్ లారీల రాకపోకలతో పాడైన రోడ్డు, లేస్తున్న దుమ్ము, ధూళి

వ్యాధులతో అవస్థ పడుతున్నాం



బీటీపీఎస్ నుంచి వెలువడె వ్యర్థాలతో కలుషితం అవుతున్న నీరు తాగి, గాలి పీల్చి వ్యాధులతో అవస్థ పడుతున్నాం. నెలకు రెండుసార్లు ఇంట్లో అందరూ జ్వరాల బారిన పడుతున్నాం. అయినా మమ్ముల్నిపట్టించుకునే నాథులే లేరు. మురుగునీరు తాగలేక ప్లాంట్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది.

–కనకమ్మ, చిక్కుడుగుంట గ్రామస్తురాలు

పంటలు దిగుబడి పోయింది..



మా భూములు తీసుకునే సమయంలో ఉపాధి, విద్య, వైద్యంపై ఇచ్చిన హామీలు అమలు ఊసేలేదు. బీటీపీఎస్, సింగరేణి ప్రభావిత ప్రాంతమైన విప్పలసింగారంలోని కోల్ వాషరీ ప్లాంట్ నీరు పొలాల్లోకి వస్తోంది. దీంతో దిగుబడి పోయిందని చెప్పినా పట్టించుకోవట్లేదు.

–సోడె రవి, విప్పలసింగారం గ్రామస్థుడు

ఎపిక్ కార్డులను పంపించేందుకు సిద్ధం చేస్తున్న సిబ్బంది



ఎపిక్ కార్డులొచ్చేస్తున్నాయ్..

ఖమ్మంసహకారనగర్: ఓటరుగా నమోదు చేసుకుని గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న వారి నిరీక్షణకు తెరపడనుంది. కొత్త ఓటరుగా నమోదు చేసుకున్న వారిలో కొందరికి ఇప్పటికే కార్డులు ఇంటికి చేరగా.. మిగతా వారికి సైతం పంపించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఖమ్మం కలెక్టరేట్‌కు చేరిన కార్డులను సిబ్బంది ప్రత్యేక కవర్లలో పెట్టి తపాలా శాఖ ఉద్యోగులకు అందజేస్తున్నారు. అక్కడి నుంచి స్పీడ్ పోస్టులో ఓటర్లకు కార్డులు చేరతాయి. కాగా, ఈ కవర్‌లో ఓటరు గుర్తింపు కార్డుతో పాటు ఓటరు ప్రతిజ్ఞ, ఓటు వేసే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్నికల సంఘం రూపొందించిన కరపత్రాలు కూడా ఉన్నాయి.



మంత్రి హరీశ్‌రావుతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ

కాంగ్రెస్‌కు జెడ్పీటీసీ గుడ్‌బై

హరీశ్‌రావు సమక్షాన బీఆర్ఎస్‌లో చేరిక

కామేపల్లి: ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోని కామేపల్లి జెడ్పీటీసీ సభ్యుడు బానోత్ వెంకట ప్రవీణ్‌కుమార్‌నాయక్ కాంగ్రెస్‌ను వీడారు. కాంగ్రెస్ నుంచి ఇల్లెందు టికెట్ ఆశించిన ఆయనకు నిరాశ ఎదురుకావడంతో రెబల్‌గా నామినేషన్ వేశారు. ఇంతలోనే మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు సమక్షాన బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయన వెంట పాస్నేకల్ ఎంపీటీసీ మాలోత్ శంకర్‌నాయక్ కూడా గులాబీ కండువా కప్పుకున్నారు.

మీ బాధ్యత సైతం నాదే..!



వానరాలకు పండ్లు వేస్తున్న ఎంపీ రవిచంద్ర, తదితరులు

ఇల్లెందు: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కొద్దినెలలుగా బీఆర్ఎస్ ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ప్రచారం, సమన్వయం కోసం ఈ రెండు నియోజకవర్గాలకు వచ్చి వెళ్తున్న క్రమంలో ఆయన ఇల్లెందు – టేకులపల్లి మధ్య ఆకలితో అలమటిస్తున్న కోతులు పెద్దసంఖ్యలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో మంగళవారం ఇల్లెందు నుంచి కొత్తగూడెం బయలుదేరిన ఎంపీ.. అరటి పండ్లు కొనుగోలు చేసి తన వాహనంలో తీసుకెళ్లి కోతులకు వేశారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన...



అధికారులకు సూచనలు చేస్తున్న హరికిషోర్

మణుగూరు రూరల్ : మండలంలోని జెడ్పీ కో–ఎడ్యుకేషన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను, పీవీ కాలనీ సింగరేణి ఉన్నత పాఠశాల, క్రియేషన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.హరికిషోర్, రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ మంగళవారం సందర్శించారు. పోలింగ్ నిర్వహణ అంశాలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.రాఘవరెడ్డి, తహసీల్దార్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఆర్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాటి అభ్యర్థులు.. నేటి మిత్రులు



ప్రచార వాహనంపై కోనేరు చిన్ని, వనమా, ఎడవల్లి కృష్ణ

సుజాతనగర్: కొత్తగూడెం నియోజకవర్గ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒకప్పుడు ప్రత్యర్థులుగా తలపడిన నేతలు ఇప్పుడు ఒకే గూటికి చేరారు. బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన కోనేరు చిన్ని(సత్యనారాయణ), కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఎడవల్లి కృష్ణ మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు తరఫున సుజాతనగర్‌లో జరిగిన ప్రచారంలో పాల్గొనడం విశేషం. 2009 ఎన్నికల్లో పీఆర్పీ నుంచి, 2014లో ఇండిపెండెంట్‌గా, 2018లో బీఎల్ఎఫ్ నుంచి ఎడవల్లి కృష్ణ పోటీ చేశారు. ఈసారి కాంగ్రెస్ టికెట్ ఆశించినా ఫలితం లేక బీఆర్ఎస్‌లోకి వచ్చారు. ఇక టీడీపీ నుంచి బీజేపీలోకి వెళ్లి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించిన కోనేరు చిన్ని సైతం ఇటీవల బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన 2014లో టీడీపీ నుంచి పోటీ చేశారు. ఇలా ఒకే నియోజకవర్గం నుంచి వేర్వేరు పార్టీల తరఫున పోటీ పడిన ముగ్గురు ఒకే వేదికపైకి చేరడాన్ని ప్రజలు ఆసక్తిగా గమనించారు.

మళ్లీ తెరపైకి 'అవిశ్వాసం'

- కౌన్సిలర్ల సంతకాల సేకరణ
- ససేమిరా అన్న కొందరు
- సోషల్ మీడియాలో చైర్మన్, కౌన్సిలర్ల ఫోన్ సంభాషణ



ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం

ఇల్లెందు: అసెంబ్లీ ఎన్నికల వేళ మున్సిపల్ పాలకవర్గానికి గండం ఎదురైంది. నిన్నటి వరకు అధికార పార్టీలో ఉన్న చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు (డీవీ)ను అవిశ్వాసం పెట్టి దించాలని యుద్ధం జరగగా అసెంబ్లీ ఎన్నికల వేళ ఆయన బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో అవిశ్వాసం అంశం తెరమీదకు వచ్చింది. అప్పుడే సంతకాల సేకరణ కూడా షురూ అయ్యింది. కొంత మంది కౌన్సిలర్‌లు ససేమిరా అంటే వారికి 'పైకం' ముట్టజెప్పి సంతకాలు చేయించినట్లు తెలిసింది. సోమవారం రాత్రి పట్టణంలోని లలిత కళామందిర్ రోడ్‌లో ఓ ప్రజాప్రతినిధి ఇంటి వద్ద జరిగిన సమావేశంలో సంతకాల సేకరణ జరిగినట్లు సమాచారం. గతంలో కొందరు కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లగా అప్పుడు దూరంగా ఉన్న కౌన్సిలర్లను కూడా ఆహ్వానించి వారి నుంచి సంతకాలు సేకరించారు. అయితే ఎన్డీ, సీపీఐలకు చెందిన ఇద్దరు డీవీ వెంట ఉన్న ముగ్గురు, ముందే కాంగ్రెస్‌లో చేరిన మరో కౌన్సిలర్ తప్ప అంతా సంతకాల సేకరణకు తలొగ్గారు. దీంతో అవిశ్వాసం కోసం ఇప్పటికే అందరికీ రూ.2 లక్షలు అందాయి. రానున్న జనవరిలో కౌన్సిల్‌కు నాలుగు ఏళ్లు నిండుతాయి. అవిశ్వాసం ప్రక్రియకు మార్గం సుగమం అవుతుందని ముందస్తుగా ఈ ప్రక్రియకు బీజం వేశారు. ఇటీవల మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుతోపాటు ముగ్గురు కౌన్సిలర్‌లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరినందున అవిశ్వాసం ప్రకటించి దించి వేయాలని ఇటీవల అధికార పార్టీ కౌన్సిలర్ల సమావేశంలో నిర్ణయించారు.

ససేమిరా అన్న ఇద్దరు..

సంతకాల సేకరణ సమయంలో ఇద్దరు కౌన్సిలర్‌లు అంగీకారం తెలుపకపోవటంతో కొంతసేపు హైరానా చోటు చేసుకుంది. చైర్మన్‌ను దించేందుకు వారు అంగీకరించలేదు. అయితే చైర్మన్ వెంటే వెళ్లాలని, పార్టీలో ఉండాలనుకుంటే పార్టీ నిర్ణయం ప్రకారం నడుచుకుని అవిశ్వాసానికి అంగీకారం తెలపాలని ఒత్తిడి చేయటం, రూ.2 లక్షలు పైకం కావాలంటే సంతకం పెట్టాలని హుకుం జారీ చేశారు. దీంతో చేసేదేమీ లేక వారు రూ.2 లక్షలు తీసుకున్నారు.

ఫోన్ సంభాషణ కలకలం..

మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు.. 21వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి సరిత భర్త గణేశ్ ఫోన్ సంభాషణ వాట్సాప్ గ్రూపుల్లో చెక్కర్లు కొట్టింది. చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావును పదవీచ్యుతుడిని చేసేందుకు ఎమ్మెల్యే హరిప్రియ భర్త హరిసింగ్‌నాయక్ పన్నిన 'వ్యూహం' వారి సంభాషణలో బట్టబయలైంది. ఈ సంభాషణకు సంబంధించిన మూడు భాగాల ఆడియో టేపులు వాట్సాప్ గ్రూపుల్లోకి రావడంతో కలకలం రేపింది. ఇదిలాఉండగా చైర్మన్ డీవీ.. ఉద్యమకారుడు ఎర్రబెల్లి కిష్టయ్య మధ్య రెండు నెలల కిందట జరిగిన ఫోన్ సంభాషణను బీఆర్ఎస్ వర్గీయులు వదిలారు. ఇలా రోజంతా వాట్సాప్ గ్రూపుల్లో ఆడియోల కలకలం కనిపించింది.

బీఆర్ఎస్ నాయకుడి ఇంట్లో తనిఖీ



సోదాలు నిర్వహిస్తున్న అధికారులు

పాల్వంచ: పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ కిలారు నాగేశ్వరరావు ఇంట్లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం మంగళవారం సోదా చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పంపిణీ కోసం భారీ ఎత్తున నగదు ఉంచారనే సమాచారంతో స్క్వాడ్ అధికారి భాస్కర్‌రావు నేతృత్వంలో గట్టాయిగూడెంలోని ఆయన ఇంటికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు. నాగేశ్వరరావు కుమారుడు చిన్ని సైతం ఊర్లో లేకపోగా అతడి గదులను సైతం తీయించి పరిశీలించినా ఎక్కడా నగదు లభించకపోవడంతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా కిలారు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అధికారులకు తప్పుడు సమాచారం అందిందని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక నామినేషన్ ఉపసంహరణ

అశ్వారావుపేట: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గం నుంచి దాఖలైన నామినేషన్ల నుంచి బుధవారం ఒకరు ఉపసంహరించుకున్నట్లు రిటర్నింగ్ అధికారి పర్సా రాంబాబు తెలిపారు. నామినేషన్ల తిరస్కరణ తర్వాత 23 నామినేషన్లు మిగలగా, వాటిలో యుగ తులసి పార్టీ అభ్యర్థి తాటి నవీన్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు చెప్పారు. ఇంకా 22 నామినేషన్లు ఉండగా బుధవారం ఉపసంహరణకు తుది గడువు అని ఆయన వివరించారు.

స్కోడా కారులో గంజాయి రవాణా!



గంజాయి, నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

పాల్వంచ: కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల సమీపంలోని రాజస్థాన్ దాబాకు చెందిన అహ్మద్ రజా, మహారాష్ట్రకు చెందిన నగేశ్, రాజస్థాన్‌కు చెందిన రాజు కలిసి స్కోడా కారులో రూ.20 లక్షల విలువైన గంజాయిని ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరిలో కొనుగోలు చేసి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్ర తరలించేందుకు బయలుదేరారు. పాల్వంచలోని బీసీఎంరోడ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతి, సీఐ సర్వేశ్వరరావు కారును అదుపులోకి తీసుకుని, గంజాయి బండిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు. దాడిలో హెడ్ కానిస్టేబుళ్లు కరీం బాబు, కానిస్టేబుల్ సుధీర్, హరీశ్, వెంకట్ హనుమంతరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బూర్గంపాడు: మండలంలోని నాగినేనిప్రోలు గ్రామం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. బూర్గంపాడు నుంచి భద్రాచలం వస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న వ్యక్తి కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, అతడి వివరాలు తెలియరాలేదు.

కోడిపందేల స్థావరంపై దాడి

ములకలపల్లి: కోడిపందేలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. రంగాపురం గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో దాడులు నిర్వహించి రూ.7,650 నగదు తోపాటు మూడు కోడి పుంజులు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

■ హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి చేయబడును. సెల్: 7842279342, హన్మకొండ. [WA-7246]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం : 9010299957
9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి

కేవలం రూ. 500/- మాత్రమే (GST 5% అదనం)